సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 6 । డిసెంబర్ । 2024



శ్రీరస్తు.. కల్యాణమస్తు

మార్గశిర మాసంలో పెళ్లి బాజాలు మోగనున్నాయి. ఈనెల 7, 10 తేదీల్లో బలమైన ముహూర్తాలు ఉండడంతో వేలాది పెళ్లిళ్లు జరగనున్నాయి. 8లో ▸



అత్తిలి షష్ఠి చూసొద్దాం రండి

అత్తిలిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం షష్ఠి వేడుకలకు ముస్తాబైంది. శుక్రవారం రాత్రి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. 8లో ▸



పూత.. జాగ్రత్త

మెట్ట ప్రాంతంలో జీడి తోటలు పూత దశలో ఉన్నాయి. ఈ సమయంలో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని ఉద్యాన అధికారులు సూచిస్తున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడిగా నౌడు



ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నౌడు వెంకటరమణను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ఆయన చేసిన కృషికి గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో బీసీ వర్గానికి చెందిన కీలక నేతగా ఉంటూ పార్టీ శ్రేణులకు అండగా నిలిచి రాబోయే కాలంలో క్షేత్రస్థాయిలో పార్టీ విజయానికి సైనికుడిలా పని చేస్తానని అన్నారు. తనకు పార్టీలో ప్రాధాన్యత కల్పిస్తూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా చేస్తానన్నారు. ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, సమన్వయకర్తలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలకు అన్నివేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే వరకూ ప్రజల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు. సూపర్ 6 హామీలపై ప్రజలు నమ్మకాన్ని కోల్పోయారని, సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం జగన్ గత ఐదేళ్లలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్నారని చెప్పారు. అయితే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు భయపడటం సిగ్గుచేటు అన్నారు. ప్రజల నెత్తిన భారం మోపుతూ విద్యుత్ చార్జీలు పెంచారని మండిపడ్డారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ప్రజలకు చేసింది శూన్యమని విమర్శించారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్ బీసీలకు పెద్దపీట వేశారన్నారు.

హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పనకు కృషి



హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ నాగరాణి

పెనుమంట్ర: జిల్లాలోని వసతి గృహాల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం మండలంలోని పాలమూరులో సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఆమె తనిఖీ చేశారు. వసతి గృహాన్ని పరిశీలించి అత్యవసర మరమ్మతులు చేపట్టాలని హౌసింగ్ అధికారికి ఆదేశించారు. టాయిలెట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ బాగా చదువుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. తల్లిదండ్రులకు దూరంగా వసతి గృహంలో ఉంటున్న మీరంతా పట్టుదలతో చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు. హాస్టల్‌లో ఇబ్బందులు ఉంటే సంబంధిత అధికారులకు తెలపాలన్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. హాస్టల్ శ్లాబ్ మరమ్మతులు, నూతన టాయిలెట్ల నిర్మాణానికి రూ.14.40 లక్షల వ్యయంతో ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, జిల్లా హౌసింగ్ అధికారి పి.అచ్చియ్య, తహసీల్దార్ వై.రవికుమార్ ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని వసతి గృహాల్లోని పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం కలెక్టరేట్ నుంచి గూగుల్ మీట్ ద్వారా జిల్లాలోని వసతి గృహాల్లో విద్యార్థులతో సమావేశమయ్యారు. ఏడు సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో 44 మంది, 13 వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాల్లో 110 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. వారిలో స్ఫూర్తి నింపేలా గూగుల్ మీట్ ద్వారా కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడి, జిల్లా అధికారులుపాల్గొన్నారు.

నేటి నుంచి తల్లిదండ్రుల సమావేశాలు

భీమవరం: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం, కార్యసాధన, దూరదృష్టిని అలవాటు చేయడమే ధ్యేయంగా శుక్రవారం నుంచి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్స్ ఆత్మీయ సమావేశాలను ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, ఆశ్రమ, ఆదర్శ పాఠశాలల్లో సమావేశాల్లో నిర్వహిస్తామన్నారు. తల్లిదండ్రులకు రంగోళి, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహిస్తామన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

ప్రశాంతం



ఏలూరులో బ్యాలెట్ బాక్సులో ఓటు వేస్తున్న మహిళా టీచర్

- ఏలూరు జిల్లాలో 91.60 శాతం, పశ్చిమలో 93.27 శాతం ఓటింగ్ నమోదు
- 475 మంది ఉపాధ్యాయులు పోలింగ్‌కు దూరం
- పోలింగ్ సరళిని పరిశీలించిన కలెక్టర్లు
- కాకినాడకు బ్యాలెట్ బాక్సుల తరలింపు
- 9వ తేదీన కౌంటింగ్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోరు ప్రశాంతంగా ముగిసింది. మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం నుంచి పుంజుకుంది. ఏలూరు జిల్లాలో 91.60 శాతం, పశ్చిమగోదావరి జిల్లాలో 93.27 శాతం పోలింగ్ నమోదైంది. ఏలూరు కలెక్టర్ కె.వెట్రిసెల్వి, పశ్చిమగోదావరి కలెక్టర్ చదలవాడ నాగరాణి రెండు జిల్లాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

ప్రశాంతంగా ముగిసి..

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గురువారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమై సాయంత్రం 4 గంటల వరకు కొనసాగాయి. రెండు జిల్లాల్లో మందకొడిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నం నుంచి పుంజుకుంది. సార్వత్రిక ఎన్నికలు తలపించే రీతిలో ఎమ్మెల్సీ అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం చేశారు. ఎన్నికల్లో ఐదుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురానికి చెందిన గంధం నారాయణరావు, పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన బొర్రా గోపీమూర్తిలకు వివిధ ఉపాధ్యాయ సంఘాలు మద్దతు పలికి ఎన్నికల ప్రచారం నిర్వహించడంతో ఆసక్తికర పోరు ఇద్దరూ మధ్య కొనసాగనుంది. వీరితో పాటు పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లి గూడేనికి చెందిన పలుగు దీపక్, రాజమండ్రికి చెందిన డాక్టర్ కమ్మల నాగేశ్వరరావు, సామర్లకోటకు చెందిన నామాల వెంకటలక్ష్మిలు పోటీలో ఉన్నారు.



భీమవరంలో ఓటేసేందుకు వచ్చిన ఉపాధ్యాయులు

ఏలూరు జిల్లాలో 20 కేంద్రాలు

ఏలూరు జిల్లాలో పోలింగ్ సరళి మందకొడిగా ప్రారంభమైంది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ 10 గంటల సమయానికి జిల్లాలో 15.52 శాతంగా నమోదైంది. మధ్యాహ్నం 12 గంటలకు 47.62 శాతంగా, 2 గంటలకు 74.58 శాతంగా, సాయంత్రం 4 గంటలకు 91.60 శాతంగా నమోదైంది. జిల్లాలో మొత్తం 2,667 ఓట్లకుగాను 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. వీటిలో 2,443 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 1,387 మంది పురుషులు, 1,058 మంది మహిళలు ఉన్నారు.

'పశ్చిమ'లో 20 కేంద్రాలు

పశ్చిమగోదావరి జిల్లాలోని 20 పోలింగ్ బూత్‌ల్లో 3,729 మంది ఓటర్లకు గాను 3,478 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 251 మంది ఉపాధ్యాయులు పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. ఉదయం 10 గంటలకు 26.20 శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 56.69 శాతం, మధ్యాహ్నం 2 గంటలకు 79.03 శాతం, సాయంత్రం 4 గంటలకు 93.27 శాతంగా పోలింగ్ నమోదైంది. రెండు జిల్లాల్లో 40 పోలింగ్ బూత్‌ల్లో సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసిన తర్వాత రిటర్నింగ్ అధికారుల సమక్షంలో బ్యాలెట్ బాక్సులు సీల్ వేసి కాకినాడలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు.



ఏలూరు కోటదిబ్బ డిగ్రీ కళాశాల కేంద్రంలో క్యూలో నిలబడి గుర్తింపు కార్డులు చూపిస్తున్న టీచర్లు

కట్టుదిట్టంగా పోలింగ్



వీరవాసరం హైస్కూల్‌లో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 93.27 శాతం మేర పోలింగ్ నమోదయ్యింది. జిల్లాలోని పలు కేంద్రాలను కలెక్టర్ సి.నాగరాణి, జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని కలెక్టర్ తెలిపారు. బ్యాలెట్ బాక్సులను భీమవరం కలెక్టరేట్‌కు అక్కడి నుంచి కాకినాడలోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తామన్నారు.

వీరవాసరం: వీరవాసరం ఎంఆర్‌కే జెడ్పీ హైస్కూల్‌లో టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను గురువారం కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలింగ్ సరళిని పరిశీలించారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ పోలింగ్ నిర్వహిస్తున్నట్టు ఆమె చెప్పారు. ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని అధికారులకు సూచించారు.

పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటింగ్

మండలం	ఓటర్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
అత్తిలి	90	88	97.78
ఆకివీడు	90	82	91.11
ఆచంట	63	62	98.41
భీమవరం	759	694	91.44
గణపవరం	66	63	95.45
ఇరగవరం	53	49	92.45
కాళ్ల	52	45	86.54
మొగల్తూరు	88	85	95.59
నరసాపురం	425	401	94.35
పెంటపాడు	73	68	93.15
పోడూరు	71	68	95.77
పాలకోడేరు	102	99	97.06
పెనుమంట్ర	85	79	92.94
పెనుగొండ	156	148	94.87
పాలకొల్లు	480	444	92.50
తాడేపల్లిగూడెం	377	353	93.63
తణుకు	407	381	93.61
ఉండి	69	63	91.30
వీరవాసరం	129	118	91.47
యలమంచిలి	94	88	93.62

జిల్లాలో పుష్పరాజ్ మ్యానియా



భీమవరంలో ఓ థియేటర్ వద్ద అల్లు అర్జున్ అభిమానుల సందడి

భీమవరం: అల్లు అర్జున్ నటించిన పుష్ప–2 చిత్రం విడుదల కావడంతో గురువారం జిల్లావ్యాప్తంగా సందడి కనిపించింది. అల్లు అర్జున్ అభిమానులు థియేటర్లకు భారీగా తరలివచ్చారు. బాణసంచా కాల్పులతో సందడి చేశారు. జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకు, ఆకివీడు పట్టణాల్లో సుమారు 20 పైగా స్క్రీన్స్‌తో పాటు అత్తిలి, గణపవరం, పెనుగొండ, వీరవాసరం మండలాల్లోని థియేటర్లతో పుష్ప చిత్రం ప్రదర్శిస్తున్నారు. పలు ప్రాంతాల్లో ఉదయం 5 గంటలకే షో ప్రారంభం కాగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రేక్షకులు 4 గంటలకే థియేటర్ల వద్దకు చేరుకున్నారు. థియేటర్ల వద్ద భారీ క్యూలు కనిపిస్తున్నాయి. అల్లు అర్జున్ నటన, డైలాగులు, పాటలు, ఫైట్స్ బాగున్నాయని అభిమానులు అంటున్నారు.

ఏలూరు జిల్లాలో 30కు పైగా స్క్రీన్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లావ్యాప్తంగా పుష్ప–2 సినిమా సందడి కనిపించింది. జిల్లాలోని పలు థియేటర్ల వద్ద అభిమానులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. తొలుత బుధవారం రాత్రి కొన్ని థియేటర్లలో బెనిఫిట్ షోలు వేయగా టికెట్ రూ.1,000 వసూలు చేశారు. జిల్లాలో దాదాపు 30 స్క్రీన్‌లపై సినిమా ప్రదర్శితమవుతుండగా అన్ని థియేటర్ల హౌస్‌ఫుల్ కావడం అభిమానుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. ప్రేక్షకుల నుంచి స్పందన బాగుందని ఎగ్జిబిటర్లు అంటున్నారు.

ఊరంతా బెల్ట్ షాపులే..

- మద్యం హబ్‌గా తణుకు
- విచ్చలవిడిగా అమ్మకాలు
- దుకాణాలకు సీల్ వేసినా విక్రయాలు





తణుకులో బెల్టు షాపు నుంచి మద్యం సీసాలు తీసుకెళ్తున్న దృశ్యం, మొబైల్ సర్వీసు ద్వారా విక్రయం

తణుకు అర్బన్: కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులై పారుతోంది.. ఊరూవాడా బెల్ట్ షాపుల్లో యథేచ్ఛగా మద్యం విక్రయాలు సాగుతున్నాయి. అలాగే ఎనీ టైమ్ మందు అన్నట్టుగా మద్యం అందుబాటులో ఉంటోంది. మద్యం దుకాణాలు బార్లను సైతం తలపిస్తున్నాయి. తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 3వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి శుక్రవారం సాయంత్రం 4 గంటల వరకు మద్యం అమ్మకాలు నిషేధిస్తూ దుకాణాలు తెరవరాదని ఎక్సైజ్ అధికారులు షాపులకు సీల్ వేశారు. అయితే సీల్ వేసిన నిమిషాల వ్యవధి నుంచి తణుకు నియోజకవర్గంలో సందుల్లో, కిళ్లీ కొట్లు, పలు ఇళ్ల వద్ద మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వైన్ షాపులు మూసివేసిన నేపథ్యంలో బెల్టు షాపుల్లో అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నారని మందుబాబులు అంటున్నారు.

మొబైల్ సర్వీసులు : రెండు రోజులుగా నియోజకవర్గంలో బెల్టు షాపులతో పాటు మొబైల్ మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. చిన్నారులకు సైతం మందు సీసాలు విక్రయిస్తుండటం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ముఖ్యంగా తణుకులోని పాతవూరు ప్రాంతంలో మద్యం అమ్మకాలు బహిరంగంగానే జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

సంతలో సరుకులా.. మద్యం దుకాణాలు ఏర్పాటుచేసిన తొలిరోజుల్లో తణుకులో సంతలో కూరగాయలు మాదిరిగా మద్యం సీసాలు, గ్లాసులు పెట్టి మైనర్లు మద్యం విక్రయించడం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. అప్పటినుంచి పరిస్థితిలో ఎలాంటి మార్పులేదు. ఇప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని పలువురు అంటున్నారు. ప్రభుత్వ విధానాలకు తలొగ్గి చేసేది లేక ఎక్సైజ్ అధికారులు మొక్కుబడిగా రోజూ ఒక కేసు నమోదు చేయించి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉపకారం.. ప్రతిభకు ప్రోత్సాహం

- ఎన్ఎంఎంఎస్ పరీక్ష
- విద్యార్థులకు కేంద్రం ఆర్థిక భరోసా
- ఏడాదికి రూ.12 వేల చొప్పున అందజేత
- ఈనెల 8న పరీక్ష
- జిల్లాలో 5,471 మంది దరఖాస్తు



మాదిరి ప్రశ్నపత్రాలతో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

నిడమర్రు: ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించే జాతీయస్థాయి ప్రతిభ ఉపకార వేతనం (ఎన్ఎంఎంఎస్)–2024 పరీక్షకు ఏర్పాట్లు పూర్తయినట్టు ఏలూరు డీఈఓ ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి 5,471 మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారన్నారు. పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఉదయం, సాయంత్రం గైడ్ టీచర్లు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గత ఎన్ఎంఎంఎస్ ప్రశ్నపత్రాలతోపాటు మాదిరి ప్రశ్నపత్రాలతో రోజు వారి పరీక్షలు రాయిస్తున్నారు. పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకూ నాలుగేళ్లపాటు ఏడాదికి రూ.12 వేల చొప్పున రూ.48 వేలను కేంద్ర ప్రభుత్వం నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమచేస్తుంది. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి స్కాలర్‌షిప్‌ల ద్వారా ప్రోత్సహించేలా ఏటా కేంద్ర ప్రభుత్వం ఈ పరీక్షలను నిర్వహిస్తోంది.

24 పరీక్షా కేంద్రాలు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పరీక్షల నిర్వహణకు 24 కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఏలూరులో 12, భీమవరంలో 12 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తంగా 383 ప్రభుత్వ పాఠశాలల నుంచి 5,471 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షల నిర్వహణకు ఏలూరు జిల్లాకు రూ.51,888, పశ్చిమగోదావరి జిల్లాకు రూ.47,284 నిధులు మంజూరు చేశారు. హాల్‌టికెట్లు అందని వారు బీఎస్ఈ.ఏపీ.జీఓ.ఐఎన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

జిల్లా	విద్యార్థులు
ఏలూరు	2,788
పశ్చిమగోదావరి	2,683
మొత్తం	5,471

పరీక్షలు ఇలా..

గతేడాది ఏలూరు జిల్లాలో 2,870 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 138 మంది ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. ఓసీ జనరల్ విద్యార్థి 180 మార్కులకు 99 పొందినా ఎంపికయ్యాడు. ఈనెల 8న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పరీక్ష నిర్వహిస్తారు. విద్యార్థులు 30 నిమిషాల ముందే హాజరుకావాలని. ఉదయం 10 గంటలకు ఒక్క సెకను ఆలస్యమైనా అనుమతించరు. డిజిటల్ వాచీలు, కాలిక్యులేటర్లు, పేజర్లు, సెల్ ఫోన్ వంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను పరీక్ష హాల్‌లో నిషేధించారు. పరీక్ష అనంతరం ఓఎంఆర్ జవాబు పత్రాన్ని ఇన్విజిలేటర్‌కు అందజేయాలి. అలా చేయని పక్షంలో వారిపై క్రిమినల్ చర్యలకు బాధ్యులు చేస్తారు.

పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం



గతేడాది ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో మా పాఠశాల నుంచి 9 మంది దరఖాస్తు చేసుకుంటే ఆరుగురు ఎంపికయ్యారు. వారిలో ఐదుగురు జనరల్ కేటగిరీ విద్యార్థులే ఉన్నారు. ఈ ఏడాది 8 మంది విద్యార్థులను ఈ పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం.

– ఎల్.ప్రసాదరావు, గైడ్ టీచర్, ఎంపీయూపీ స్కూల్, జల్లి కొమ్మర

రోజూ ఇంటి వద్ద సాధన



పాఠశాలలో ప్రత్యేక తరగతులతో పాటు ఇంటి వద్ద కూడా సాధన చేస్తున్నా. పేపర్–1లో మంచి మార్కులు వస్తున్నాయి. పేపర్–2లో వచ్చే ప్రశ్నలపై వారం రోజులుగా ప్రాక్టీస్ చేస్తున్నా. ప్రాక్టీస్ పరీక్షల్లో 130 మార్కుల వరకూ వస్తున్నాయి.

– నిమ్మల హనుమ, ఎన్ఎంఎంఎస్ అభ్యర్థి, గణపవరం

ప్రయాణికులకు మెరుగైన సేవలు



కొత్త బస్టాండును పరిశీలిస్తున్న ఆర్టీసీ జోన్ చైర్మన్ అప్పలనాయుడు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు, బస్టాండ్ల ప్రాంగణాల్లో మౌలిక వసతులు కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తుందని ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు అన్నారు. జోన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా ఏలూరులోని కొత్త బస్టాండ్‌ని గురువారం ఆయన పరిశీలించారు. మౌలిక సదుపాయాలపై ప్రయాణికులను ఆరా తీశారు. అనంతరం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్‌తో కలిసి ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సంక్రాంతి, శివరాత్రి తదితర పండుగల రద్దీ దృష్ట్యా బస్సు సర్వీసులు పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలోని జంగారెడ్డిగూడెం, చింతలపూడి, ఏలూరు డిపోల నుంచి తిరుమల తిరుపతికి ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి మరిన్ని ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. రాష్ట్రంలో 16 వేల మంది వరకు డ్రైవర్, కండక్టర్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు.

క్లుప్తంగా

అధ్యాపకుడికి ఉత్తమ పరిశోధన అవార్డు


కైకలూరు డిగ్రీ కాలేజీలో హరిప్రసాద్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీలత

కైకలూరు : వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ చరిత్ర శాఖాధిపతి మంగళగిరి హరిప్రసాద్‌కు జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ పరిశోధన అవార్డు దక్కింది. అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన తమిళనాడు రాష్ట్ర కొయంబత్తూరు నాలెడ్జ్ రీసెర్చ్ అకాడమీకి హరిప్రసాద్ పంపిన పరిశోధన పత్రాలు, పుస్తకాలను పరిగణలోకి తీసుకుని ఈ అవార్డుకు ఎంపిక చేశారు. వ్యక్తిగత కారణాల రీత్యా కొయంబత్తూరు వెళ్లలేకపోవడంతో పోస్టు ద్వారా అవార్డు, ధ్రువపత్రాలను పంపించారని హరిప్రసాద్ గురువారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ వై.శ్రీలత, సహ అధ్యాపకులు అవార్డు గ్రహీత హరిప్రసాద్‌ను అభినందించారు.

హుండీ ఆదాయం రూ.22.43 లక్షలు


శ్రీక్షీరా రామలింగేశ్వరస్వామి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్ : పంచారామ క్షేత్రం శ్రీక్షీరా రామలింగేశ్వరస్వామి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారు వి వెంకటేశ్వరరావు, పోలీస్, రెవెన్యూ శాఖల పర్యవేక్షణలో ఆలయ ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 83 రోజులకుగాను రూ.2243,859 ఆదాయం లభించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. శ్రీ క్షీరారామ సనాతన దాండియా గ్రూపు, శ్రీ హరే శ్రీనివాస కోలాట భజన మండలి గ్రూపు, విశ్రాంత బ్యాంక్ ఉద్యోగులు, తపాలాశాఖ ఉద్యోగులు ఆర్ఎస్ శర్మ, డీఎస్ ప్రకాష్, ఇరుసుమండ గ్రూపు సభ్యులు, ఏఎస్సై ఎస్ మార్లింగం, ఆలయ ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, అర్చకస్వాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు ట్రిపుల్ ఐటీలో స్టార్టప్ కేంద్రం ప్రారంభోత్సవం

నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో యూఎస్ఏ ఆధారిత సంస్థ పారాబోలా 9 ఏర్పాటు చేసిన స్టార్టప్ కేంద్రం ప్రారంభానికి సిద్ధమైంది. ఈ స్టార్టప్ కేంద్రాన్ని ఐ3 భవనంలో ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న 15 మంది విద్యార్థులను ఫుల్‌టైం ఇంటర్న్‌లుగా నియమించగా, ద్వితీయ, తృతీయ సంవత్సరాలకు చెందిన 8 మంది విద్యార్థులు పార్ట్‌టైం ఇంటర్న్‌లుగా సహకారం అందించనున్నారు. ఈ కేంద్రాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఈ నెల 6వ తేదీన ప్రారంభించనున్నట్టు ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు.

కట్నం వేధింపులపై కేసు

జంగారెడ్డిగూడెం: అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలం కట్టవ పాదలవారిగూడెంకు చెందిన గొల్లపల్లి వెంకటలక్ష్మికి, జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురానికి చెందిన బండెల మధుసూదనరావుకు 2021లో వివాహమైంది. వివాహ సమయంలో వెంకటలక్ష్మి కుటుంబసభ్యులు కట్నంగా రూ.4 లక్షలు, సారె రూ.2 లక్షలు, పదికాసుల బంగారం, మోటార్‌సైకిల్ ఇచ్చారు. అయితే అదనపు కట్నం కోసం భర్త వేధిస్తున్నాడని, అతని కుటుంబ సభ్యులు సహకరిస్తున్నారని వెంకటలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

శ్రీరస్తు.. కల్యాణమస్తు

- మార్గశిర మాసంలో మోగనున్న పెళ్లి బాజాలు
- 7, 10 తేదీల్లో శుభ ముహూర్తాలు
- ఈనెల 25 వరకూ శుభ ఘడియలే





వీరవాసరం: మార్గశిర మాసంలో పెళ్లి బాజాలు మోగనున్నాయి. ఈ నెల 2వ తేదీన మార్గశిరం ప్రారంభం కాగా ఈ మాసంలోనే పెళ్లిళ్లు ఎక్కువగా జరుగుతుంటాయి. ఈనెల 7, 10 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉండడంతో ఎక్కువ పెళ్లిళ్లు జరగనున్నాయి. 7వ తేదీ ఒక్క రోజే వందల సంఖ్యలో జంటలు ఒక్కటి కానున్నాయి. ఈ మాసంతో పాటు వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో కూడా జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. మార్చి రెండో వారం నుంచి శుక్ర మౌఢ్యమి(మూఢం) రానుండడంతో ఇప్పుడున్న ముహూర్తాల్లోనే పెళ్లిళ్లు చేయాలని పెద్దలు ఆరాట పడుతున్నారు.

ట్రెండ్‌కు తగ్గట్లుగా...

వివాహ వేడుకలంటే గతంలో బ్యాండ్ మేళాలు.. భాజా భజంత్రీలు, పూల మండపాలు, వీడియో షూటింగ్‌లు వంటివి చాలా సాధారణంగా ఉండేవి. మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా వివాహ ముహూర్తానికి ముందే సంగీత్ కార్యక్రమాలు, ప్రీ వెడ్డింగ్, పోస్ట్ వెడ్డింగ్ షూట్లకు ఇతర ప్రాంతాల లొకేషన్లకు, ప్రకృతి, చారిత్రక ప్రాంతాలకు వెళ్తున్నారు. సినిమాటిక్‌గా వధూవరులచే స్పెషల్ సాంగ్స్ రూపకల్పన చేసి అవి ముందుగానే సోషల్ మీడియాలో విడుదల చేయడం, కళ్యాణ వేదికపై ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లపై ప్రదర్శించడం లాంటి విభిన్న సంస్కృతిని అవలంభిస్తున్నారు.

ఉపాధి మార్గాలు

మార్గశిర మాసంలో వరుసగా పెళ్లి ముహూర్తాలు ఉండటంతో వివిధ రంగాల వారు ఉపాధి పొందుతున్నారు. కల్యాణ మండపాలకు బాగా డిమాండ్ పెరిగింది. పూల డెకరేషన్, లైటింగ్ వంటి పనులు చేస్తున్న వారికి చేతి నిండా పనులు లభిస్తున్నాయి. బోటిక్స్, బ్యూటీషియన్లకు డిమాండ్ పెరిగింది. ఫుడ్ క్యాటరింగ్ వారు, వేద పండితులు, భజంత్రీల వారు బిజీబిజీగా ఉండనున్నారు.

మార్కెట్‌లో మస్తు వ్యాపారం

మార్గశిర మాసంలో శుభకార్యాలు అధికంగా ఉండడంతో మార్కెట్‌లో వ్యాపారాలు జోరందుకున్నాయి. జిల్లా కేంద్రాలు భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు పట్టణాల్లోని బంగారు, వస్త్ర, కిరాణా దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. ప్రతి రోజు అన్ని రకాల వ్యాపార లావాదేవీలు సుమారు రూ.5 కోట్ల వరకు ఉన్నట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

పెళ్లి ముహూర్తాల వివరాలు

- డిసెంబర్ మార్గశిర మాసంలో 4, 5, 6, 7, 8, 11, 12, 14, 15, 20, 21, 26, 27, 28 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి.
- 2025 జనవరి పుష్యమాసంలో 30వ తేదీ వరకు వివాహాలు, ఇతర శుభ ముహూర్తాలు లేవు.
- జనవరి 31వ తేదీన మాఘమాసం ప్రారంభవుతుంది. 31న మంచి ముహూర్తం ఉంది.
- ఫిబ్రవరి మాఘ మాసంలో 2, 6, 7, 8, 9, 12, 13, 14, 15, 16, 21, 22, 23, 26న ముహూర్తాలు ఉన్నాయి.

డిసెంబర్ పొడవునా ముహూర్తాలే

మార్గశిర మాసం డిసెంబర్ పొడవునా ముహూర్తాలు ఉన్నాయి. ఈ నెలలో 7, 10 తేదీల్లో ఎక్కువ శుభకార్యాలు ఉన్నాయి. పెళ్లిళ్లతో పాటు గృహ ప్రవేశాలు, నామకరణాలు, ఎంగేజ్‌మెంట్‌లు, కేశఖండన లాంటి వేడుకల నిర్వహణకు ఎక్కువగా ఇష్ట పడుతున్నారు. జనవరిలో పుష్యమాసం కావడంతో పెద్దగా ముహూర్తాలు లేవు.

– మళ్ల రాంబాబు, తులసీ కన్వెన్షన్ సెంటర్, వీరవాసరం

అత్తిలి షష్ఠి చూసొద్దాం రండి

- నేటి రాత్రి శ్రీస్వామివారి కల్యాణం
- 7న షష్ఠి మహోత్సవం


విశేష అలంకరణలో శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారు


అత్తిలిలో శ్రీస్వామివారి ఆలయ ప్రాంగణం

అత్తిలి: సుబ్బారాయుడి షష్ఠి మహోత్సవాలు నేటినుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఉత్సవాలకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు నిర్మించి, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. షష్ఠి ఉత్సవాల్లో అత్తిలి సుబ్బారాయుడి షష్ఠికి విశిష్టమైన స్థానం ఉంది. కోరిన కోర్కెలు తీర్చే కల్పతరువుగా అత్తిలి శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామిని భక్తులు కొలుస్తారు. షష్ఠి రోజున నాగదోషం ఉన్నవారు, సంతానం లేనివారు, వివాహం కానివారు, కుజదోషం, కాలసర్పదోషం ఉన్నవారు ఈ దేవాలయాన్ని దర్శించి, భక్తిశ్రద్ధలతో స్వామివారికి పంచామృతాలతో అభిషేకించడం ద్వారా తమ కోర్కెలు తీరతాయని భక్తుల విశ్వాసం. సంతానంలేనివారు నాగుల చీర కట్టుకుని, ముడుపులు కడతారు. సంతానం కల్గినతరువాత పిల్లల తలనీలాలు సమర్పించి మొక్కులను తీర్చుకుని, పిల్లలపై నుంచి బూరెలను పోసే సంప్రదాయం ఇక్కడ ఉంది. అదేవిధంగా చిన్నపిల్లలకు నామకరణం, అన్నప్రాసన, అక్షరాభ్యాసం వంటి శుభకార్యక్రమాలు ఈ ఆలయంలోనే నిర్వహిస్తుంటారు. ప్రతి ఏటా జరిగే ఉత్సవాలను లక్షమందికి పైగా భక్తులు స్వామిని దర్శిస్తారు. భక్తులకు ఇబ్బంది లేకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎస్సై పి పేమరాజు పటిష్ఠమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆలయ చరిత్ర..

1910 దశకంలో అత్తిలి పంచాయతీ కార్యాలయం సమీపంలో కోనేరు చెరువువద్ద ఒక పెద్ద నాగులపుట్ట ఉండేది. పుట్టలో ఉండే పాము సంచరించడంతో ఆ ప్రాంత ప్రజలు పుట్టకు పూజలు చేసేవారు. అనంతరం ఏకశిలపై శ్రీవల్లీదేవసేన సమేతుడైన శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారు కొలువైఉన్న విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం మార్గశిర మాసంలో పంచమి రోజున స్వామివారి కల్యాణం, షష్ఠి తిథిన షష్ఠీతీర్థం, రాత్రికి స్వామివారి ఊరేగింపు ఉత్సవం జరుగుతుంది. ప్రతిరోజు సాయంత్రం సోమసూత్రం గుండా ఒక సర్పం గర్భగుడిలోనికి వచ్చి, మరుసటి రోజు ఉదయం బయటకు వెళుతూ ఉంటుందని, ఇది స్వామివారి దర్శనం అని ఆలయ అర్చకులు ఐలూరి శ్రీరామం తెలిపారు. అన్నదానంలో అందెవేసిన చేయిగా అత్తిలిని చెప్పుకుంటారంటే ఆ ఘనత శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి తిరునాళ్లవలనే వచ్చింది.

ఉత్సవాలు ఇలా..

ఈనెల 6వ తేదీ నుండి 20వ తేదీ వరకు జరిగే షష్ఠి మహోత్సవాల్లో ప్రతి రోజు సాయంత్రం స్వామివారి కళావేదికపై పలు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం రాత్రి 8.28 గంటలకు కూనపరెడ్డి తేజ, విజయలక్ష్మి దంపతులచే శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. 7న షష్ఠి తీర్థ మహోత్సవం సందర్భంగా ఉదయం కోలాట భజన, అన్నసమారాధన, రాత్రి శ్రీస్వామివారి ఊరేగింపు ఉత్సవ కార్యక్రమాలు జరుగుతాయని షష్ఠి కమిటీ అధ్యక్షుడు కుర్మెళ్ల ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడు దిరిశాల మాధవరావు తెలిపారు.

నేల సారం పెంపు బాధ్యత అందరిదీ

ఉద్యాన వర్సిటీ విస్తరణ సంచాలకులు బి.గోవిందరాజులు


ప్రపంచ నేలల దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉద్యానవర్సిటీ విస్తరణ సంచాలకులు బి.గోవిందరాజులు

తాడేపల్లిగూడెం : నేలసారం పెంచుకొనేందుకు రైతులు ప్రయత్నం చేయాలని ఉద్యాన వర్సిటీ విస్తరణ సంచాలకులు బి.గోవిందరాజులు పిలుపునిచ్చారు. ప్రపంచనేలల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం వెంకట్రామన్నగూడెంలోని కేవీకేలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత కాలంలో అవలంభించిన సాగు పద్ధతులు ఏ విధంగా నేల సారాన్ని ఎలా క్షీణింపచేశాయో వివరించారు. నూతనమైన సాగు విధానాలతో నేల సారం పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కేవీకే సమన్వయకర్త ఇ.కరుణశ్రీ మాట్లాడుతూ పరిశోధన ఫలితాలు రైతులకు అందాలన్నారు. ప్రకృతి వ్యవసాయం నేల సంరక్షణకు ఉపకరిస్తుందన్నారు. నేలలు విష తుల్యం కాకుండా ఉండాలంటే సిఫార్సు చేసిన పోషకాలు, సేంద్రియ విధానాలు పాటించి నేలలను కాపాడాలని శాస్త్రవేత్త బి.పెదబాబు అన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు విజయలక్ష్మి, వరప్రసాదరెడ్డి, దీప్తి, ఇ.రేఖ వివిధ విషయాలను వివరించారు. రైతులు తమ విజయగాథలు తెలియజేశారు.

సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో విజయరాజు


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో ఆర్.విజయరాజు

ఏలూరు(మెట్రో) : క్షేత్ర స్థాయిలో సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా గ్రామ పంచాయతీలు పనిచేయాలని, అందుకు ప్రభుత్వ శాఖల అధికారుల ఉమ్మడి కృషి ఎంతో అవసరం అని జిల్లా ప్రజా పరిషత్ ఇన్‌చార్జి ముఖ్యకార్యనిర్వహణ అధికారి డాక్టర్ ఆర్.వి జయరాజు అన్నారు. గురువారం ఏలూరులోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ పేదరిక నిర్మూలన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయిలు వెచ్చిస్తుందని గుర్తు చేశారు. సదరు పథకాలకు అర్హులైన వారిని గుర్తించి వారికి ప్రయోజనం చేకూర్చేందుకు గ్రామ పంచాయతీ ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. డీఎల్‌డీవోలు వై.దోసి రెడ్డి, ఎం.రాజు, ఏబీవీపీ లక్ష్మి మాట్లాడుతూ 2030 నాటికీ అన్ని స్థానిక ప్రభుత్వాలు సుస్థిర అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని కోరారు. అందుకు అనుగుణంగా గ్రామ, మండల, జిల్లా అభివృద్ధి ప్రణాళికలను తయారుచేసుకోవాలన్నారు. సుస్థిర అభివృద్ధిని సాధించుటకు అన్ని ప్రభుత్వశాఖలతో సమన్వయం కోసం ప్రభుత్వం వివిధ శిక్షణ కార్యక్రములను క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ట్రైనింగ్ మేనేజరు జి.ప్రసంగిరాజు తెలిపారు. ఈనెల 10వ తేదీ నుండి మండలాల్లో శిక్షణ కార్యక్రమలు ప్రారంభమవుతాయన్నారు. సామర్లకోట ఈటీసీ ఫ్యాకల్టీ సభ్యుడు ఎం.చక్రపాణి రావు, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ మేనేజర్ ఈ.అనిత, ఏపీఎం టి.నాగేశ్వరరావు, మెడికల్ విభాగం కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్స్ రోజ్‌మేరి, కృష్ణ కిషోర్, పంచాయతీ రాజ్ విభాగం జీడీ శ్రీనివాసరావు తదితరులు 9 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై తరగతులు బోధించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 17 మండలాలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీడి మామిడి పూత.. జాగ్రత్త


మెట్ట ప్రాంతంలో పూత దశలో ఉన్న జీడి మామిడి తోట


జీడి తోటలకు నష్టం కలిగించే టి దోమ

చింతలపూడి: మెట్ట ప్రాంతంలో జీడితోటలు విస్తరించి ఉన్నాయి. ప్రస్తుతం జీడి తోటలు పూత దశలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో జీడిమామిడి రైతులు పూత దశ నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చింతలపూడి సబ్ డివిజన్ ఉద్యాన శాఖాధికారిణి ఎండీ షాఫియ ఫర్హీన్ సూచనలు చేశారు. సాధారణంగా జీడిమామిడిలో పూత అక్టోబర్, నవంబర్ నెలల్లో మొదలై జనవరి, ఫిబ్రవరి వరకు వస్తుంది. జీడిచెట్టుకు వచ్చిన పూతలో సుమారు 200 నుంచి 800 వరకు పూలు పూస్తాయి. జీడిమామిడి చెట్లు పరాగ సంపర్కం వల్ల ఫలదీకరణ చెందుతాయి. జీడిమామిడి చెట్లు పూతకు రావాలంటే సుమారు 25 రోజుల నుంచి 30 రోజులు పొడి వాతావరణం ఉండాలి.

వర్షాలు పడితే పూత ఆలస్యం

ఒకవేళ అక్టోబర్ నుంచి నవంబర్ నెల వరకు వర్షాలు పడినట్లు అయితే పూత ఆలస్యమై రాలిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అలాగే తెగుళ్ల తీవ్రత కూడా ఎక్కువయ్యే అవకాశాలు ఉన్నాయి. జీడిమామిడి అంట్లు నాటిన రెండవ సంవత్సరం నుంచే పూత వస్తుంది. ఆ పూతను రైతులు తుంచివేసి చెట్ల శాఖలు పెరగడానికి ప్రోత్సహించాలి. దీనివల్ల చెట్లు బలంగా పెరిగి ఎక్కువ దిగుబడిని ఇస్తాయి. వర్షాకాలంలో సిఫార్సు చేసిన ఎరువులు రెండు నుంచి మూడు సమ భాగాలుగా వేసుకోవాలి. ఐదు సంవత్సరాలు పైబడిన చెట్టుకు యూరియ 1.5 కేజీలు, సూపర్ ఫాస్ఫేట్ 650 గ్రాములు, పొటాష్ కేజీ వేసుకోవాలి. పూత దశలో మంచు ఎక్కువగా పడుతున్నప్పుడు పూత లోపల తేమ చేరి ఎండిన మగపూల వలన తామర పురుగులు లేదా తేయాకు దోమ ఉద్ధృతి ఎక్కువయ్యే అవకాశాలు ఉంటాయి.

రసం పీల్చేసే టి దోమ

జీడిమామిడిలో టి దోమ పూత దశ అంటే అక్టోబర్, నవంబర్ నెలలో మొదలవుతుంది. జనవరిలో ఎక్కువయ్యి లేత చిగుళ్లు, పూత, పూత కాడలను, చిన్న కాయలను ఆశించి రసం పీల్చడం ప్రారంభిస్తాయి. రసం పీల్చినప్పుడు ఒక రకమైన పదార్థం వదలడం వల్ల కాయలపై, చిగుర్లపై గజ్జిలాంటి లక్షణాలు కనిపిస్తాయి. అంతేకాకుండా పూత, చిగుర్లపై చేసిన రంధ్రాల వలన ఫ్లవర్ బైట్ అనే తెగులు కూడా వ్యాప్తి చెందుతుంది.

నివారణకు మూడు సార్లు పిచికారీ

దీని నివారణకు పూత మొదలై పువ్వు విచ్చుకోక ముందు ఒకసారి, పూలు ఫలదీకరణ చెందిన తరువాత రెండోసారి, టి దోమ ఉద్ధృతి ఎక్కువగా ఉన్నప్పుడు(కాయ గోలీ సైజులో ఉన్నప్పుడు) మూడోసారి పిచికారీ చేయాలి. చెట్లు చిగురించినప్పుడు మొదటి పిచికారీకి రైతులు లీటరు నీటికి ల్యాండా సైహాలో త్రిన్ 0.6 మిల్లీ లీటర్లు లేదా అసిటామాప్రిడ్ 0.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అలాగే పూత కొమ్మలు కనిపించినప్పుడు రెండు, మూడు వారాల తరువాత ఇమిడాక్లోప్రిడ్ 0.6 మి.లీ లీటరు నీటికి లేదా ప్రొఫెనోఫాస్ 1.5 మి.లీ, లీటర్ నీటికి కలిపి రెండో సారి పిచికారీ చేయాలి. కాయలు గోలీ సైజులో ఉన్నప్పుడు ల్యాండా సైహాలో త్రిన్ 0.6 మిల్లీ లీటర్లు లీటర్ నీటికి లేదా ప్రొఫెనోఫాస్ 1.5 మి.లీ లీటర్ నీటికి కలిపి మూడోసారి పిచికారీ చేయాలి. వీటితో పాటు వేపనూనెను తగిన మోతాదులో కలిపి వాడటం వలన మంచి ఫలితాలు వస్తాయి.

బూడిద తెగులు నివారణకు

పొడి వాతావరణం ఉన్నప్పుడు బూడిద తెగులు కారణంగా పూత రాలిపోతుంది. లేత చిగుళ్లను, పూతను ఆశించి ఎండిపోయేలా బూడిద తెగులు చేసి పంటను నష్టపరుస్తుంది. దీని నివారణకు సల్ఫర్ 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి లేదా ట్రైడెమోర్ఫ్ 1.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఆకు, పూత, కాయమచ్చ తెగులు నివారణ

ఆకులపై చిన్న, చిన్న లేత ఆకుపచ్చ వర్ణంలో మచ్చలు ఏర్పడి క్రమేపీ మచ్చలు పెరుగుతూ మచ్చ మధ్య ఎండిపోయి చివరికి మొత్తం ఆకు ఎండి రాలిపోతుంది. పూత మరియు పూత కాడలపై మచ్చలు వచ్చి పూత ఎండిపోయి రాలిపోతుంది. దీని నివారణకు రైతులు తొలుత తెగులు ఆశించిన కొమ్మలు తొలగించుకోవాలి. మంకోజెట్ ఒక గ్రాము లీటరు నీటికి, లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటికి, లేదా క్లోరో తాలోనిల్ ఒక మిల్లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.


ఎండీ షాఫియ ఫర్హీన్, ఉద్యాన శాఖాధికారిణి, చింతలపూడి సబ్ డివిజన్

ఫెన్సింగ్ పోటీల్లో చిన్నారికి కాంస్యం



ఇంటర్నేషనల్ ఫెన్సింగ్ పోటీల్లో కాంస్య పతకం విజేత ధృతిసమీక్ష

భీమవరం: మలేషియాలో నిర్వహించిన మినిమ్ ఇంటర్నేషనల్ ఫెన్సింగ్ టోర్నమెంట్‌లో భీమవరం పట్టణానికి చెందిన మంతెన ధృతిసమీక్ష కాంస్య పతకం సాధించినట్లు ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గుణ్ణం కృష్ణమోహన్ తెలిపారు. గత నెల 30వ తేదీ నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు జరిగిన టోర్నమెంట్‌లో భారత్, కొరియా, ఆస్ట్రేలియా, జర్మనీ వంటి 12 దేశాల నుంచి సుమారు 600 మందికిపైగా క్రీడాకారులు పాల్గొన్నట్లు చెప్పారు. ధృతిసమీక్ష అండర్-12 ఈపీ విభాగంలో కాంస్య పతకం సాధించిందన్నారు. విజేతను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు, కృష్ణమోహన్, మెంటర్ నాగం సతీష్ బాబు తదితరులు అభినందించారు.

దాడిపై కేసు నమోదు

పెదవేగి : తన పొలంలోకి రావద్దని మందలించినందుకు తనను అన్యాయంగా చితక్కొట్టారంటూ ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై కె.రామకృష్ణ తెలిపిన వివరాలివి. ముందూరు గ్రామానికి చెందిన బలుసు రవికుమార్‌కు చెరుకు తోట ఉంది. నిత్యం జాలాది సుధీర్, మరి కొందరు పొలంలో చెరుకు గడలు విరుచుకుని తినేస్తున్నారని, తోటలోని షెడ్డులో అసాంఘిక కార్యక్రమాలు చేస్తున్నారని, అలా చేయవద్దని తాను చెప్పినట్లు రవికుమార్ తెలిపారు. దీంతో సుధీర్, మరికొందరు బుధవారం సాయంత్రం పామాయిల్ కాటా వద్ద రవికుమార్‌పై కర్రలతోనూ, రాళ్లతోనూ దౌర్జన్యంగా కొట్టి గాయపరిచారు. గాయపడిన రవికుమార్‌ను స్థానికులు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

ఉపాధి కోసం వచ్చి మృత్యుఒడికి


మృతిచెందిన బాబు

పెనుమంట్ర : ఉపాధి కోసం వచ్చి ఓ యువకుడు మృత్యువాత పడిన ఘటన పెనుమంట్ర మండలం ఎస్ ఇల్లిందలపర్రు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై కె స్వామి తెలిపిన వివరాలివి. నెల్లూరు జిల్లా రామచంద్రాపురం మండలం బుచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఏకశిరి బాబు(14) కోతమిషన్‌ల పని నిమిత్తం ఇల్లిందలపర్రు వచ్చాడు. గ్రామం నుంచి మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా ఆటో ఢీకొనడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రుడిని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. బాబు సమీప బంధువు రాగి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్వామి చెప్పారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


శ్రీనివాస్ మృతదేహం

భీమడోలు: అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గుండుగొలనులో చోటుచేసుకుంది. ఉంగుటూరు మండలం తల్లాపురం గ్రామానికి చెందిన దూసనపూడి శ్రీనివాస్ (58) రైతు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. వ్యవసాయంలో నష్టాలు రావడంతో అప్పులపాలయ్యాడు. అప్పుల బాధతో మనస్తాపం చెందిన రైతు శ్రీనివాస్ గురువారం గుండుగొలనులోని బ్రాహ్మణ చెర్వు వద్ద గుర్తు తెలియని మందును సేవించి మృతి చెందాడు. శ్రీనివాస్ కుమారుడు శివకృష్ణ ఫిర్యాదు మేరకు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాస్ మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి శవ పంచనామాకు తరలించారు.

నేటి నుంచి న్యాయవాదుల జాతీయ సదస్సు

ఏలూరు (ఆర్ఆర్‌పేట)/పెదవేగి: దేశంలో అనేక మంది కథోలిక గురువులు, కన్యా స్త్రీలు న్యాయవాదులుగా రాణిస్తున్న తరుణంలో వారికి న్యాయవాద వృత్తిపై మరింత అవగాహన పెంచడానికి న్యాయవాదుల జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు సదస్సు నిర్వహణ బృందం పీఆర్ఓ ఫాదర్ ఇమ్మానియేలు ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు పీఠాధిపతి, విశాఖ అగ్రపీఠ అపోస్తలిక పాలనాధికారి బిషప్ పొలిమేర జయరావు ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఏలూరు సమీపంలోని సెయింట్ జోసఫ్ డెంటల్ కళాశాల ప్రాంగణంలో ఈ సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సులో ఒంగోలు సెషన్స్ జడ్జి దున్న రాములు, ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోనే సీతారాం, ప్రముఖ న్యాయవాది జీ. రోనాల్డ్ రాజు, కీనోట్ అడ్రస్ కోసం మద్రాస్ హైకోర్టు సీనియర్ న్యాయవాది ఐసాక్ మోహన్‌లాల్ పాల్గొంటారని తెలిపారు. వీరితో పాటు దేశంలోని 130 మంది న్యాయవాదులు పాల్గొంటారని, ఈ సదస్సును నిర్వహణ బృందం సభ్యులు ఫాదర్ బాల, ఫాదర్ జీ. మోజెస్, ఫాదర్ ఇంజేపాలు, ఫాదర్ పీ జాకబ్ పర్యవేక్షిస్తారన్నారు.

ఎన్నికల వేళ.. జోరుగా మద్యం విక్రయాలు


పాలకోడేరులో మద్యం విక్రయిస్తున్న దృశ్యం

పాలకోడేరు : ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా రెండు రోజులపాటు మద్యం అమ్మకాల్ని ఎన్నికల సంఘం నిషేధించింది. పాలకోడేరు మండలంలో ఇదే అదనుగా భావించిన మద్యం వ్యాపారులు ముందుగానే మద్యం నిల్వలను బయటకు తరలించి బెల్ట్‌షాపుల ద్వారా అధిక ధరలకు విక్రయించారు. రూ.99 ఉన్న మద్యం సీసాలను రూ.250కు విక్రయించి మద్యం ప్రియులను దోచుకున్నారు. అలాగే 120, 130, 180 రూపాయలు ఉన్న క్వార్టర్ బాటిల్స్‌ను సైతం అధిక రేట్లకు విక్రయించారు. ఇష్టానుసారంగా మద్యంను విక్రయిస్తున్నా అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో జోగుతున్నారని పలువురు బహిరంగానే విమర్శిస్తున్నారు.

క్లుప్తంగా

మద్యం పట్టివేత


పట్టుకున్న మద్యం సీసాలతో ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి

తాడేపల్లిగూడెం: పట్టణంలోని యాగర్లపల్లిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి గురువారం పట్టుకున్నారు. బెల్ట్ షాపు నిర్వహిస్తున్న సదరు వ్యక్తి నుంచి 12డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఎస్ఐలు మురళీమోహన్, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పెద్దింట్లమ్మ ఆలయ వార్షికోత్సవం


అప్పారావుపేటలోని పెద్దింట్లమ్మ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని అప్పారావుపేట గ్రామంలో పెద్దింట్లమ్మ వారి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గ్రామస్తులు చలిమిడి, పానకాలు, చీర, జాకెట్, గాజులు వంటి మంగళద్రవ్యాలను సమర్పించి, భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. పుల్లాయగూడెం, అప్పారావుపేట గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ నిర్మాణ కుటుంబ సభ్యులు మద్దుకూరి సత్యనారాయణ, మురళీమోహన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్న పరిశ్రమల స్థాపనపై సర్వే


పట్టణంలో ఎంఎస్ఎంఈ సర్వేలో చేస్తున్న మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు

తాడేపల్లిగూడెం: వ్యాపారంలో పోటీతత్వం పెంచడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు సేవలను పునరుద్ధరించడం జరిగిందని మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు. వ్యాపారాలకు సేవలను మొబైల్ యాప్ ఆధారిత సర్వే ద్వారా సేకరించే వాటి లక్ష్యాలను వ్యాపారులకు వివరించారు. ఈ సర్వేలో కమిషనర్‌తో పాటు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛభారత్


తణుకులో వాకింగ్ ట్రాక్‌ను శుభ్రం చేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

తణుకు టౌన్: పట్టణంలోని ఎస్కేఎస్ఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకింగ్ ట్రాక్‌ను స్వచ్ఛందంగా శుభ్రం చేశారు. గురువారం ఉదయం మార్నింగ్ వాక్‌కు వచ్చిన వాకర్స్ స్వచ్ఛందంగా చీపుర్లు పట్టి ట్రాక్‌ను శుభ్రం చేసి ట్రాక్ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బసవ రామకృష్ణ, కోశాధికారి చిక్కాల సత్యనారాయణ రిటైర్డ్ ప్రిన్సిపల్ యలమర్తి రాజేంద్రబాబు, సభ్యులు మణికంఠ రాజా, గాడి సూరిబాబు, పాతూరి శివాజీ, అడ్డాల నారాయణరావు, కొర్లేపర సత్యనారాయణ, మహిళా వాకర్లు పాల్గొన్నారు.

ఉమాసిద్ధేశ్వరస్వామికి విశేష పూజలు


ఉమాసిద్ధేశ్వర స్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

అత్తిలి: మండలంలోని ఉమాసిద్ధేశ్వరస్వామికి గురువారం విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బండి అంజన్న, తెదేపా మండలాధ్యక్షుడు ఆనాల ఆదినారాయణరావు, సూర్యచంద్రరావు, హరి, పుప్పాల అర్జునరావు, రంగారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దడపుట్టిస్తున్న ధరలు


తణుకులో కూరగాయల దుకాణం


తణుకులో కిరాణా సరుకులు

- సలసల కాగుతున్న నూనెలు
- షాకిస్తున్న నిత్యావసర సరుకులు, కూరగాయలు
- ధరల నియంత్రణలో విఫలమైన కూటమి సర్కారు
- కూటమి ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతున్న ప్రజానీకం

తణుకు అర్బన్: నిత్యావసర సరుకుల ధరలు కొండెక్కి పేద, మధ్య తరగతి వర్గాలకు దడపుట్టిస్తున్నాయి. కష్టపడుతున్న సంపాదనకు పొంతన లేని విధంగా మార్కెట్‌లో సరుకుల ధరలు అమాంతం పెరిగిపోవడంతో సామాన్య ప్రజానీకం గగ్గోలు పెడుతున్నారు. కడుపునిండా ఇష్టమైన ఆహారం తినాలన్నా కుదరడం లేదని, ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబపోషణ కూడా భారంగా మారిపోతుందని వాపోతున్నారు. కూరగాయలు కొనలేక కళ్లకు కళ్లెం, పచారీ సరుకులు కొనలేక పస్తులు ఉంటున్న దుస్థితి నెలకొందంటూ వాపోతున్నారు. మార్కెట్‌లో నిత్యాసవర సరుకులు, వంటనూనెలు, కూరగాయల ధరలను నియంత్రించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ప్రజానీకం ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచి ధరలు పెరుగుతున్న తీరుపట్ల ప్రజానీకం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూరగాయల ధరలు ఎక్కువగా పలికిన రోజుల్లో పప్పులతో కాలం గడిపేసేవారమని కానీ నేడు పప్పుల ధరలు చూస్తుంటే చెమటలు పడుతున్నాయని ప్రజానీకం చెబుతున్నారు.

కిరాణా దుకాణాలు వెలవెల..

నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటడంతో తణుకు మార్కెట్‌లో కిరాణా దుకాణాలు సైతం ఖాళీ అయిపోయాయి. ముఖ్యంగా కందిపప్పు, మినపప్పు, వంటనూనెలు, వెల్లుల్లిపాయలు గత 6 నెలల క్రితం కంటే 40 శాతం ధరలు పెరిగిపోవడంతో సరుకుల కొనుగోళ్లు కూడా క్రమేపి తగ్గిపోయాయని, వినియోగదారుల కిరాణా పట్టీలు కూడా 50 శాతానికి పడిపోయాయని, ధరల పెరుగుదల కారణంగా ప్రజలు తిండి తినడం కూడా తగ్గిం చేశారని చెబుతున్నారు. ముఖ్యంగా వెల్లుల్లిపాయలు కిలో ధర రూ. 440 అమ్మకాలు జరుగుతున్నాయంటే ధరలు ఏమేరకు పెరిగాయో అర్థమవుతోంది. దీంతో పేద మధ్యతరగతి వర్గాలు తమకు కావాల్సిన ఆహారపదార్థాల వంటకాల్లో సైతం కోతలు కోసేస్తున్నారని తెలుస్తోంది.

కూటమి ప్రభుత్వంలో ప్రజలు వీరబాదుడు చూస్తున్నారు



బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ అంటూ మైకుల్లో ఊదరగొట్టేశారు. కానీ కుర్చీలో కూర్చున్న తర్వాత వీరబాదుడు గ్యారంటీ అని ప్రజలపై కక్షగట్టినట్లుగా ప్రవర్తిస్తుంది కూటమి ప్రభుత్వం. గత 6 నెలల క్రితం వరకు మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ధరలు నేడు ఆకాశాన్నంటడంతో పేద మధ్యతరగతి వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లక్షాధికారిని చేస్తానన్న నోటితో నేడు భిక్షాధికారులుగా చేసి చూపిస్తున్నారు. గత జగన్ ప్రభుత్వ హయాంలో బాదుడే బాదుడని కూటమినేతలు రోడ్లపైకి వచ్చారని నేడు ఈ వీరబాదుడికి కారణమైన ప్రభుత్వాన్ని భవిష్యత్తులో ఏమిచేయాలో ప్రజలో తెలుస్తారు. ఉల్లిపాయలతోపాటు వంటనూనెలు, కందిపప్పు ధరలు గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తుండడం బాధాకరం. గతంలో జగన్ హయాంలో ప్రకృతి విపత్తులతో పాటు కూరగాయల ఉత్పత్తి సరిపోని సమయాల్లో రైతుబజార్ల ద్వారా కూరగాయలను తక్కువ ధరలకు అందుబాటులో ఉంచేవారు. కానీ నేడు సామాన్య ప్రజానీకం సరుకులు కొనలేక పస్తులు ఉండే పరిస్థితిని చంద్రబాబు కల్పించారని విమర్శించారు.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ మంత్రి

కిరాణా సరుకుల ధరలు (కిలో)

సోనామసూరు బియ్యం (హెచ్ఎంటీ)	రూ. 60
వెల్లుల్లిపాయలు	రూ. 440
వేరుశనగగుళ్ల	రూ. 180
కందిపప్పు	రూ. 200
పెసరపప్పు	రూ. 160
పచ్చిశెనగపప్పు	రూ. 110
మినపప్పు	రూ. 110
సన్‌ఫ్లవర్ ఆయిల్	రూ. 155

కూరగాయల ధరలు

ఉల్లిపాయలు	రూ. 70
అల్లం	రూ. 80
బీట్‌రూట్	రూ. 80
కేరట్	రూ. 80
వంకాయలు	రూ. 60
టమాట	రూ. 60
బీరకాయలు	రూ. 60

ధరలు ఆకాశాన్నంటాయి



కిరాణా సరుకులు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటడంతో ఏమి కొనాలన్నా భయమేస్తోంది. కందిపప్పు రికార్డు బ్రేక్‌గా రూ. 200 చేరింది. కేజీ పప్పు కొనే వారు పావు కేజీ కొనుక్కునే పరిస్థితి దాపురించింది. ఇంతకు ముందెన్నడూ ధరలు ఇంతెక్కువ పెరగలేదు. కూరగాయలు కూడా కొనలేని విధంగా ధరలు పెరిగాయి. ఇలా అయితే ఏమి తినాలి ఎలా బ్రతకాలి.

– ఎన్నా రాణి, తణుకు

సుబ్రహ్మణ్య షష్ఠికి వేళాయె..

- ఆలయాల్లో పూర్తయిన ఏర్పాట్లు
- నియోజకవర్గంలో ప్రసిద్ధి చెందిన ఆలయాలెన్నో


మోదుగ గుంట సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం

తాడేపల్లిగూడెం రూరల్: సుబ్రహ్మణ్య షష్ఠికి వేళయ్యింది. ఆ స్వామిని కొలిచే వేడుకకు సర్వం సిద్ధమైంది. వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలకు ప్రముఖ ఆలయాలు ముస్తాబవుతున్నాయి. మండలంలోని మోదుగ గుంట గ్రామంలో వల్లీదేవ సేనసమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద ఈ నెల 7 నుంచి 11వ తేది వరకు షష్ఠి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ప్రగడ నాగేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేది ఉదయం 3.42 గంటలకు కల్యాణ మహోత్సవంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 8న రాత్రి 8.30 గంటలకు శ్రీదేవీ మహత్స్యం జానపద నాటకం, 9న రాత్రి బాలనాగమ్మ వెరైటీ బుర్రకథ, పల్లకీ ఉత్సవం, 10న దేవనర్తకి నాటకం, 11న రాత్రి సినీ మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఉత్సవాలు ప్రతి రోజూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. చివరి రోజు 11న ఉదయం 11 గంటల నుంచి అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించి, తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. అలాగే ... కృష్ణాయపాలెం, ... కడియద్ద, అప్పారావుపేట, ... పట్టింపాలెం, వీరంపాలెం తదితర గ్రామాల్లో షష్ఠి ఉత్సవాలను ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


షష్ఠి దుకాణాలు

ప్రొటీన్ ఫుడ్ టిన్‌లు అందజేత


తణుకులో హెచ్ఐవీ బాధిత చిన్నారులకు ప్రొటీన్ ఫుడ్ టిన్స్ అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

తణుకు అర్బన్: మంచి పోషకాహారం, క్రమం తప్పకుండా మందుల వాడకంతో హెచ్ఐవీ బాధితులు తమ జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆనందం మస్తాన్‌రావు (బాబి), కఠారి సిద్ధార్థ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ వారోత్సవాల్లో భాగంగా గురువారం తణుకు సేఫ్ కేర్ సెంటర్‌లో మందులు తీసుకుంటున్న 120 మందికి క్లబ్ ఆధ్వర్యంలో ప్రొటీన్ ఫుడ్ టిన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషకాలు అధికంగా ఉండే ఆహారమే మంచి మెడిసిన్‌గా పరిగణించాలని సూచించారు. వ్యాధిగ్రస్తుల ఆరోగ్యానికి అండగా నిలబడిన రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని సేఫ్‌కేర్ సెంటర్ ఇన్‌చార్జ్ వైద్యాధికారి డాక్టర్ ఎస్.సత్తిరెడ్డి అన్నారు. వ్యాధిగ్రస్తుల సౌకర్యార్థం రోటరీ క్లబ్ అందించిన ప్రొటీన్ ఫుడ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సాయిబాలాజీ, డాక్టర్ పుప్పాల రాజరాజేశ్వరి, డాక్టర్ ఉషారాణి, క్లబ్ ప్రతినిధులు రెడ్డి రంగారావు, డాక్టర్ కేటీవీ రెడ్డి, బీవీఎస్ రామకృష్ణ, పోతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో ఈ నెల 6 నుంచి జనవరి 8వ తేది వరకు గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. భూ ఆక్రమణలు, సరిహద్దు తగాదాలు, పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు, ఆన్‌లైన్ అడంగల్ మార్పులు చేర్పులు, ఫ్రీ హోల్డ్ ల్యాండ్, నిషేధిత భూముల జాబితా సెక్షన్ 22ఎ నుంచి తొలగించడం, ఇతర వ్యవసాయ, భూసంబంధిత సమస్యలపై అర్జీలను ఈ సదస్సుల్లో అందజేయవచ్చునన్నారు. శుక్రవారం కృష్ణాయపాలెం గ్రామంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ సదస్సు జరుగుతుందని, రైతులు, భూ యజమానులు వినియోగించుకోవాలని తహసీల్దార్ సునీల్‌కుమార్ కోరారు.

ఇరగవరం : ఈ నెల 6వ తేది నుంచి జనవరి 3వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుందరరాజు తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సులలో రైతులు వారి భూమి వివరాలు, సర్వే సమస్యలు, ఇతర భూ సమస్యలు, ప్రజా సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. గత సదస్సులలో వచ్చిన దరఖాస్తులలో అధిక భాగం పరిష్కరించామన్నారు. 6వ తేది శుక్రవారం పేకేరు గ్రామంలో సచివాలయం వద్ద సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్ చేసి రసీదు అందజేస్తామన్నారు.

రావిపాడులో చెరువు పనులు ప్రారంభం

సాక్షి స్పందన

పెంటపాడు: అడుగంటుతున్న చెరువులు అనే శీర్షికతో బుధవారం ప్రచురితమైన వార్తపై పెంటపాడు పంచాయతీ అధికారులు స్పందించారు. రావిపాడు గ్రామంలో ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ డీఎల్‌పీవో, ఎంపీడీవో సీహెచ్ బాలజీ గ్రామ సర్పంచ్ పెన్నాడ సూరిబాబు, కార్యదర్శి శేకర్‌బాబులు రావిపాడు చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచినీరు చెరువు గట్టును ఎన్ఆర్‌జీఎస్ పథకం ద్వారా అభివృద్ధి చేసే పనిలో భాగంగా తాగునీటి చెరుకు నీరు పెట్టలేదని తెలిపారు. దీనితో పాటు చెరువు చుట్టుపక్కలా శుభ్రపరిచేందుకు పంచాయతీ తీర్మానం చేశామన్నారు. రూ.10లక్షల అంచనాల వ్యయంతో 4వేలు పని దినాలు చేసేందుకు అంచనాలు రూపొందించామన్నారు. అయితే గ్రామంలో ప్రజలకు తాగునీటి సరఫరాకు సంబంధించి ఏవిధంమైన ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. ప్రతి రోజు క్లోరినేషన్ చేస్తున్నామన్నారు. చెరువు గట్టు పటిష్టం చేయడం వల్ల రాబోయే వేసవిలో మరింత ఎక్కువ నీరు నిల్వ చేయవచ్చన్నారు. తద్వారా గ్రామస్థులకు సమృద్ధిగా నీరు అందుతుందన్నారు. ఈ సందర్భంగా పనులు ముమ్మురం చేశారు.


చెరువు గట్టు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో బాలాజీ

బాలికల భవిష్యత్‌కు చదువే ఆయుధం

పెంటపాడు: భవిష్యత్‌ను బంగారంగా మార్చుకునేందుకు బాలికలకు చదువే ఆయుధమని ఎంపీడీవో సీహెచ్ బాలాజీ, ఎంఈఓ టీవీ రామకృష్ణలు పేర్కొన్నారు. పెంటపాడు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశాల మేరకు కిషోర వికాశం పేరుతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కిశోర బాలికల వికాశానికి కుటుంబం బాలికలతో కలిసిమెలిసి ఉండాలన్నారు. తల్లిదండ్రులు బాలికలతో తప్పకుండా మంచి చెడు మాట్లాడుతూ వారి అవసరాలు గుర్తించి తీర్చాలని సూచించారు. చట్టాలపై కిశోర బాలికలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పోక్సో చట్టం, అక్రమరవాణా వంటి వాటిపైనా బాలికలు పూర్తి అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దుర్గాభవానీ, సుజాత, జీజీబీ విజయలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది మెర్సీ, ఏపీఎం నాగరాజు, ఉపాధ్యాయుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంఈఓ రామకృష్ణ

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

పెంటపాడు: మండంలో ఈనెల 6 నుంచి జనవరి 4 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 6న పెంటపాడు, ఉమామహేశ్వరం, 10న ప్రత్తిపాడు, 11న అలంపురం, 12న బి. కొండేపాడు, 13న పడమరవిప్పర్రు, 17న చింతపల్లి, కోరిమిల్లి, 18న రాచర్ల, వల్లూరుపల్లి, 19న ఆకుతీగపాడు, 20న బోడపాడు, 21న కె. పెంటపాడు, డీసీహెచ్ ఖండ్రిగ, 24న యానాలపల్లి, 26న ముదునూరు, 27న దర్శిపర్రు, 28న జట్లపాలెం, జనవరి 2న మౌంజీపాడు, 3న పరిమెళ్ళ, 4న మీనవిల్లూరు, రామచంద్రపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పిల్లలకు ఆటపాటల ద్వారా విద్యనందించాలి

తణుకు టౌన్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే ప్రీ స్కూల్ విద్యార్థులను శారీరక, మాట, పాటల ద్వారా పాఠశాలకు వెళ్లేలా సన్నద్ధం చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకట లక్ష్మీ చెప్పారు. గురువారం తణుకు మండలంలోని వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహించిన ఈసీసీఈ దినోత్సవ కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలలోని ల్లలకు ఆట, పాటల ద్వారా విద్యనందించాలని కోరారు. పాఠశాలలో చేరేందుకు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలోనే చదువు పట్ల ఆసక్తిని పెంపొందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం


తాడేపల్లిగూడెం: పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బానో

తాడేపల్లిగూడెం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి గురువారం పట్టణంలోని సుబ్బారావు పేట హైస్కూల్‌లో 94 శాతం మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు పోలింగ్ ప్రారంభమైనా తొమ్మిది గంటల వరకు స్వల్పంగానే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసే సమయం నాలుగు గంటలకు 353 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం ఉపాధ్యాయ ఓటర్లు 377 మందికి గాను, 353 మంది ఓటు హక్కును (94 శాతం) వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రక్రియను ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బానో, తహసీల్దార్ సునీల్ కుమార్‌లు పర్యవేక్షించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ఇరగవరంలో..

ఇరగవరం: మండలంలో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 53 ఓటర్లకు గాను 49 మంది ఓటును వినియోగించుకున్నట్లు ఇరగవరం తహసిల్దార్ సుందరరాజు తెలిపారు.

అత్తిలిలో..

అత్తిలి: ఉమ్మడి తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాల నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం అత్తిలిలో ప్రశాంత వాతావరణంలో జరిగాయి. అత్తిలి మేడబడిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అత్తిలి మండలంలో మొత్తం 90 ఓట్లకుగాను 88 మంది ఓట్లు పోలయ్యాయని తహసీల్దార్ దశిక వంశీ తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని అడిషనల్ ఎస్పీ వి భీమారావు, తణుకు సీఐ బి కృష్ణకుమార్, అత్తిలి ఎస్ఐ పి ప్రేమరాజు, తహసీల్దార్ దశిక వంశీ సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.


తణుకు టౌన్: పోలింగ్ బూత్‌లో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఆర్డీవో


పెంటపాడు: ప్రభుత్వ బేసిక్ స్కూల్‌లో పోలీసుల బందోబస్తు

తణుకులో..

తణుకు టౌన్: ఉభయ గోదావరి జిల్లా ఉపాద్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి గురువారం నిర్వహించిన పోలింగ్‌లో తణుకు పట్టణంలో ఏర్పాటు చేసిన బూత్‌లో మొత్తం 93.61 శాతం పోలింగ్ జరిగినట్లు తహసిల్దార్ డీవీఎస్ఎస్ అశోక్‌వర్మ తెలిపారు. పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో మొత్తం 407 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవలసి ఉండగా 381 మంది మంది ఓటు వేసినట్లు తెలిపారు. వారిలో పురుషులు 215 మంది కాగా 166 మంది మహిళా ఉపాధ్యాయులు ఉన్నారు.

పెంటపాడు: మండలంలోని పెంటపాడు ప్రభుత్వ బేసిక్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ వద్ద ఎమ్మెల్సీ ఎన్నికల ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 73ఓట్లకు గాను 51ఓట్లు పోలయ్యాయని అధికారులు తెలిపారు. డీఎస్పీ విశ్వనాథ్, సీఐ రమేష్, ఎస్ఐ స్వామి, ఆర్డీవో, తహసీల్దార్, డిప్యూటీ తహల్దార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న మాలమహానాడు, ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అధికారులు ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు తెలిపారు. తాలూకా ఆఫీస్ సెంటర్ సబ్ రిజిస్టర్ కార్యాలయం ఆవరణలోని ప్రభుత్వ స్థలాన్ని లేఖర్లు కబ్జా చేశారంటూ మాలమహానాడు, ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల ప్రతినిధులు గురువారం ఆవరణలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చీకటిమిల్లి మంగరాజు మాట్లాడుతూ ఎంతో కాలంగా అక్రమంగా ప్రభుత్వ స్థలంలో లేఖర్లు పాకలు వేసుకుని కబ్జా చేశారని తెలిపారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని లేఖర్లు దోచుకొంటున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి పాకలు తీసివేసి ప్రభుత్వ ఆస్తిని పరిరక్షించాలని కోరారు. ఈ నిరసనలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ శెట్టి సుజనరావు, దళిత మహాసభ నాయకులు తాడేపల్లి దావీదు, దర్శి చంద్రశేఖర్ మెరిపో నాగరాజు, రాపాక కృష్ణ, కంకిపాటి వెంకట్, మర్లపాటి రాజు, నాగేశ్వరరావు, ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.